E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం :
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON | సంపుటి :01 | సంచిక :15 | మంగళవారం 16 జూన్ 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-

# తెలంగాణలో డిజిటల్ పాలన

## ఈ-కేబినెట్‌కు గ్రీన్ సిగ్నల్!

- పేపర్‌లెస్ పాలనకు వేగం
- ట్యాబ్‌లతోనే మంత్రివర్గ సమావేశాలు
- ఫైళ్లకు గుడ్‌బై.. డిజిటల్‌కు వెల్‌కమ్
- కేబినెట్ అజెండా ఇక ఆన్‌లైన్‌లోనే
- రహస్య సమాచారానికి పటిష్ట భద్రత
- పారదర్శక పాలనకు మరో అడుగు
- కాగితాల ఖర్చుకు చెక్
- స్మార్ట్ గవర్నెన్స్ వైపు తెలంగాణ
- ప్రతి నిర్ణయం డిజిటల్ రికార్డు
- ఈ-గవర్నెన్స్‌లో తెలంగాణ దూకుడు
- సీఎస్ సమీక్షతో ఏర్పాట్లు వేగవంతం
- డిజిటల్ కేబినెట్‌కు సర్వం సిద్ధం




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలనా విభాగంలో సరికొత్త డిజిటల్ విప్లవానికి తెరలేవనుంది. రాష్ట్ర కేబినెట్ సమావేశాలను ఇకపై పూర్తి స్థాయిలో ఎలక్ట్రానిక్ విధానంలో నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. పరిపాలనా రంగాన్ని ఆధునీకరించడంతో పాటు, ప్రభుత్వ సమాచార మార్పిడిలో వేగం, పారదర్శకతను తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇందులో భాగంగానే సచివాలయం, వివిధ డైరెక్టరేట్లు, కమిషనరేట్ కార్యాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల్లో విడతల వారీగా పేపర్‌లెస్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీఎం అధికారులకు గతంలోనే సూచించారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ సమావేశాలను సైతం డిజిటలైజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఈ సరికొత్త విధానం అమల్లోకి వస్తే.. కేబినెట్ సమావేశాల్లో మంత్రుల ముందు ఎలాంటి ఫైళ్లు, కాగితపు పత్రాలు కనిపించవు. వీటికి బదులుగా మంత్రులందరికీ అత్యాధునిక ట్యాబ్‌లను అందజేయనున్నారు. ఈ ట్యాబ్‌లకు అవసరమైన ప్రత్యేక సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సదుపాయాలను సమకూర్చే పనిలో ఐటీ, సాధారణ పరిపాలన శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్ రూపొందించిన అత్యంత సురక్షితమైన సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్ర ప్రభుత్వం వినియోగిస్తోంది.

మిగతాది 2 లో..

## తీవ్ర సంక్షోభం.. ఆదుకోండి

### చంద్రబాబుకు బీజేపీ స్టేట్ అధ్యక్షుడి లేఖ




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిగుమతి భారీగా వచ్చిన పంటకు సరైన రేటు లేకపోవడంతో నష్టపోతున్నారు. దీంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్తున్న ప్రతి పార్టీ నాయకులకు తమ పరిస్థితిని విన్నవించుకుంటున్నారు.తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుకుంటున్నారు. ఇలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన స్పందించారు.

## నేడు ఇందిరా గాంధీ బ్రతికి ఉంటే బీజేపీని బ్యాన్ చేసేవారు: మాజీ సీఎం అశోక్ గెహ్లాట్




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ బీజేపీ పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. జైపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అశోక్ గెహ్లాట్.. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రస్తుతం ఉనికిలో ఉన్న పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## ఈ నెల 18న తెలంగాణ కేబినెట్ భేటీ!




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** ఈ నెల 18న తెలంగాణ కేబినెట్ భేటీ కాబోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి మండలి సమావేశం జరగనుంది. మెట్రో టేకోవర్?పై సందిగ్ధత ఏర్పడడంతో నెక్స్ట్ ఏం చేయాలన్న అంశంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై ప్రభుత్వం మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులతో పాటు పలు కీలక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

## తెలంగాణ సెక్రటేరియట్ వద్ద పోస్టర్ల కలకలం

### పోలీసుల అదుపులో మహిళ




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ సెక్రటేరియట్ వద్ద పోస్టర్ల కలకలం రేగింది. ఉచిత పథకాలు వద్దు అంటూ సచివాలయం మీడియా సెంటర్ వద్ద గోడలకు పోస్టర్లు ప్రత్యక్షం అయ్యాయి. ప్రతిపేద వాడికి ఇల్లు, యువతకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రమ్య పేరుతో చేతి రాతతో రాసి ఉన్న పోస్టర్లు వెలిశాయి. ' మద్యం తాగేవారిని కాదు ఆ మద్యం తయారు చేసే కంపెనీ వారిని పట్టుకోండి. గెలిచేవరకు ఒక మాట గెలిచిన తర్వాత మరో మాట. ఎక్కడో ఇండ్లు ఇచ్చి ఇచ్చామని చెప్పుకోవడం కాదు. అందరికీ ఇచ్చామో లేదో అది చూసుకోండి. సీఎం రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పడం కాదు. తెలంగాణలో ఇల్లు లేని వారు ఉండొద్దు. చదువుకున్నవారికి ఉద్యోగాలు ఇవ్వాలి. నాలుగు కార్లు వేసుకుని తిరగడం కాదు. మీ కాలతో పాదయాత్ర చేయండి అప్పుడే ప్రజల తిప్పలు మీకు అర్థం అవుతుంది.

## కేరళలో నిఫా వైరస్ కల్లోలం..

## సరిహద్దుల్లో హై అలర్ట్!




## తెలంగాణ ఓటర్లకు అలర్ట్

### జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే..!




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** తెలంగాణలో ఈ నెల 25 నుంచి ఓటర్ల ప్రత్యేక 'సమగ్ర సవరణ సర్వే' (సర్) జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సిద్ధమవుతున్నారు.ఈ నెల 15 నుంచి 24 వరకు మూడు దశలుగా కార్యక్రమాలు చేపట్టనున్నారు. మొదటి దశలో సర్ సర్వే నిర్వహణ అధికారులు బిఎల్ఓలకు వారు చేపట్టాల్సిన బాధ్యతలు వంటి కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందిస్తారు.

## కాంగ్రెస్ తీరు ఇప్పటికీ మారలేదు

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్


**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** ఢిల్లీ వేదికగా జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన సేన ప్రస్థానం.. దేశ సమగ్రత కోసం సేనా ప్రస్థానం కార్యక్రమంలో పాల్గొన్న పవన్ కల్యాణ్, తెలంగాణ ఏర్పాటు, కాంగ్రెస్ నేతల తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సమగ్రత జనసేన సిద్ధాంతమని, దేశ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే జనసేన లక్ష్యమని, అందుకే ఢిల్లీలో ఈ సమావేశం ఏర్పాటు చేశామని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

అలాగే జనసేన పార్టీ ఎప్పుడు తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా కాదని, విభజన చేసిన తీరుకు తాము వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. అలాగే జనసేన పార్టీ సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని, తమను అడ్డుకునేందుకే ప్రయత్నించిన కాంగ్రెస్ పార్టీ నేతలు తమపై తీవ్ర విమర్శలు చేశారని, నేటికి కూడా కాంగ్రెస్ తీరు మారలేదని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. అలాగే సేనా ప్రస్థానం లక్ష్యాలను పార్టీ కార్యకర్థకలకు, నేతలకు వివరించారు. జనసేన పార్టీకి ఎల్లప్పుడూ సొంత ప్రయోజనాల కంటే దేశ సమగ్రత, శ్రేయస్సే అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. దేశ స్ఫూర్తిని, జాతీయ సమైక్యతను కాపాడుకోవడం అనేది ఒక్కరోజుతో ముగిసే పనికాదని, ప్రతి తరం దీనిని బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



## తెలంగాణ సెక్రటేరియట్ వద్ద పోస్టర్ల కలకలం పోలీసుల అదుపులో మహిళ

మొదటి పేజీ తరువాయి



చేసిన కష్టం ఇంటి కిరాయిలకే:

పల్లెటూర్లో పాదయాత్ర చేసినట్టు కాదు హైదరాబాద్ లో పాద యాత్ర చేయండి. అప్పుడే ఎంత మంది కిరాయికి ఉంటున్నారో మీకు అర్థం అవుతుంది. పల్లెటూరులో ఇల్లు ఇచ్చి పదే పదే చూపించుకోకండి. హైదరాబాద్ లో ఇల్లు ఇచ్చి అందరినీ ఆదుకోండి. చేసిన కష్టం ఇంటి కిరాయిలకే పోతుంటే పిల్లల్ని ఎలా చదివించుకుంటాం. ఎలా బతుకుతాం. బాధలు పడి చదివిన విద్యార్థులకు జాబులు ఇవ్వడం లేదు. ఇవి పిచ్చి గీతలు అనుకోకండి. పేదలు తలచుకుంటే రాజకీయ పార్టీలను గెలిపించాలన్నా పడగొట్టాలన్నా ప్రజల చేతుల్లోనే ఉంది. ప్రజల సమస్యలను పట్టించుకోకుంటే ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికే వెళ్లతారు. అది మీ ఇష్టం. అందుకే తెలగాణను దోచుకోవడం బంద్ చేసి ప్రజలను పట్టించుకోండి. నేను అడిగిన ప్రశ్నలకు త్వరలోనే సమాధానం చెబుతారని అనుకుంటున్నా. ఎన్ని ఏళ్లు అయినా పేదలు పెదవారిగానే, కోటీశ్వర్లు వందల కోట్లు సంపాధిస్తూ మరింత కోటీశ్వరులుగా అవుతున్నాయి. తెలంగాణ సంపద అందరిదీ అని అంబేద్కర్ చెప్పాడు. కానీ ఇప్పుడు కొంత మందితే ఈ సంపద అయిపోయింది. నేను చెప్పిన దాంట్లో ఎదైనా తప్పు ఉంటే క్షమించాలి. లేదంటే నా పేపర్లు అన్ని చించి పారేయండి నా దారిన నేను పోతాను' అంటూ ఈ పోస్టర్లపై రాసి అతికించారు.

పోలీసుల అదుపులో మహిళ:

ఈ పోస్టర్లను గమనించిన సిబ్బంది వాటిని తొలగించారు. అయితే సచివాలయం వంటి హై సెక్యూరిటీ జోన్‌లో పోస్టర్లు అంటించడం చర్చనీయాంశంగా మారింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది వెంటనే స్పందించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఆమెను సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తీవ్ర సంక్షోభం.. ఆదుకోండి: చంద్రబాబుకు బీజేపీ స్టేట్ అధ్యక్షుడి లేఖ



**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిగుమతి భారీగా వచ్చిన పంటకు సరైన రేటు లేకపోవడంతో నష్టపోతున్నారు. దీంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్తున్న ప్రతి పార్టీ నాయకులకు తమ పరిస్థితిని విన్నవించుకుంటున్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుకుంటున్నారు. ఇలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన స్పందించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. చిత్తూరు జిల్లా మామిడి రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, మామిడి కొనుగోళ్లలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని లేఖలో కోరారు. మామిడికి కనీస మద్దతు ధర ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు ఇందిరా గాంధీ బ్రతికి ఉంటే బీజేపీని బ్యాన్ చేసేవారు: మాజీ సీఎం అశోక్ గెహ్లాట్



**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ బీజేపీ పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. జైపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అశోక్ గెహ్లాట్.. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రస్తుతం ఉనికిలో ఉన్న పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నేడు గనుక మాజీ ప్రధాని ఇందిరా గాంధీ బ్రతికి ఉండి ఉంటే, మతాన్ని రాజకీయం కోసం వాడుకుంటున్న బీజేపీ లాంటి పార్టీపై ఖచ్చితంగా నిషేధం (బ్యాన్) విధించేవారని గెహ్లాట్ వ్యాఖ్యానించారు. దేశాన్ని బలోపేతం చేయాల్సింది పోయి, ముస్లింలను లక్ష్యంగా చేసుకుని కావాలనే మతపరమైన ఎజెండాను ముందుకు నెడుతూ బీజేపీ దేశాన్ని బలహీనపరుస్తోందని ఆయన ఆరోపించారు. తాము కేవలం 'హిందుత్వ' పార్టీ అని దేశ ప్రజలకు నిరూపించుకోవడానికే వారు ఇలాంటి రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తున్న ఇలాంటి శక్తులకు వ్యతిరేకంగా పోరాడటానికి 'ఇండియా' కూటమిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ఈ కూటమికి రాహుల్ గాంధీ బహిరంగంగా నాయకత్వం వహించాలని గెహ్లాట్ కోరారు. గతంలో ఇందిరా గాంధీ కాలంలో 'కాంగ్రెస్ హఠావో, దేశ్ బచావో' అంటూ విపక్షాలన్నీ ఏకమైనప్పటికీ.. కేవలం రెండున్నర ఏళ్లలోనే ప్రజలు ఆమెను తిరిగి అధికారంలోకి తెచ్చారని గుర్తుచేశారు. ప్రజలు నిజం గ్రహించి కాంగ్రెస్ వైపు నిలబడిన రోజున.. ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో ఉన్న పార్టీలన్నీ బీజేపీకి వ్యతిరేకంగా మారుతాయని అశోక్ గెహ్లాట్ ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణ ఓటర్లకు అలర్ట్.. జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే..!

మొదటి పేజీ తరువాయి




జిల్లా ఎన్నికల అధికారుల వారిగా క్షేత్ర స్థాయిలో ఈ సన్నద్ధత కార్యక్రమాన్ని చేపడతారు. ఇక రెండో దశలో సర్ సర్వేలో డిఈఓ, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బిఎల్ఓ పర్యవేక్షకులు, బిఎల్ఓలకు శిక్షణ అందిస్తారు. మూడో దశలో సర్వేలో భాగంగా ఇంటింటికి అందించే ఎన్యుమరేషన్ పత్రాలని ముద్రిస్తారు. సన్నద్ధత ఏర్పాట్లు పూర్తయిన తర్వాత ఈ నెల 25 నుంచి జూలై 24 వరకు బిఎల్ఓలు సర్ సర్వేను నిర్వహిస్తారు. జూలై 31న ముసాయిదా జాబితాను ప్రదర్శించనున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఫిర్యాదులు అభ్యంతరాల స్వీకరణ సందేహాలు ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేస్తారు. వారి గుర్తింపు కార్డుల పరిశీలన ప్రక్రియలను చేపడతారు. అక్టోబర్ 1న ఓటర్ల తుది జాబితాను ప్రదర్శిస్తారు.

## కాంగ్రెస్ తీరు ఇప్పటికీ మారలేదు : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మొదటి పేజీ తరువాయి



అప్పట్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని విభజించిన అనాలోచిత తీరు వల్ల రెండు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, అశాంతి నెలకొన్నాయని.. ఆ తప్పుడు విభజన వల్లే నేటికీ రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల పంపిణీ సహా పలు వివాదాలు నలుగుతూనే ఉన్నాయని ఆయన పవన్ కల్యాణ్ తప్పుపట్టారు. విభజన శక్తులపై రాజీలేని పోరాటం చేయడమే తెలంగాణలో జనసేన ప్రస్థానం ప్రారంభించినప్పటి నుంచి తమకున్న ఏకైక నిబద్ధత అని గుర్తుచేశారు. అలాగే సొంత రాష్ట్రాల్లో 'ఢిల్లీ మెడలు వంచుతాం' అంటూ ప్రగల్భాలు పలికే నాయకులు, తీరా ఇక్కడికి రాగానే నోరు విప్పలేకపోతున్నారంటూ పరోక్షంగా ఇతర రాజకీయ పక్షాలపై పవన్ కల్యాణ్ పదునైన విమర్శలు గుప్పించారు.

## కేరళలో నిఫా వైరస్ కల్లోలం.. సరిహద్దుల్లో హై అలర్ట్!




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** కేరళం రాష్ట్రంలో మరోసారి నిఫా వైరస్ కలకలం గా మారింది. గంటగంటకు పెరుగుతున్న పాజిటివ్ కేసులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కోజికోడ్‌లో ఈ నిఫా వైరస్ కలకలం రేపుతోంది. అక్కడ రెండు వందల మందికి పైగా ఈ వైరస్ బారిన పడినట్లు నిర్ధారణ అయింది. దీంతో పొరుగు రాష్ట్రమైన తమిళనాడు అప్రమత్తమైంది. కేరళతో సరిహద్దు పంచుకుంటున్న కోయంబత్తూర్, తెని, కన్యాకుమారి తో పాటు కడలూరు జిల్లాల వైద్య ఆరోగ్య శాఖలను తమిళనాడు ప్రభుత్వం హై అలర్ట్ చేసింది. సరిహద్దు దాటి వచ్చే ప్రయాణికులపై నిఘా ఉంచడంతో పాటు, నిఫా లక్షణాలు ఉన్నట్లు అనుమానం వచ్చిన వారిని వెంటనే గుర్తించి మెడికల్ క్యాంపులకు తరలిస్తున్నారు. వైరస్ రాష్ట్రంలోకి వ్యాపించకుండా తమిళనాడు సర్కార్ అన్ని ముందస్తు జాగ్రత్తలు ముమ్మరం చేసింది. దీంతో కేరళం, తమిళనాడు సరిహద్దు గ్రామాల్లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

## మెట్రోపై బీజేపీ-బీఆర్ఎస్ కుట్ర?



**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** హైదరాబాద్ ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలంటే అంతర్జాతీయ ప్రమాణాల రవాణా సౌకర్యాలు అవసరమని, ఆ ఆలోచనతోనే మెట్రో రైలు ప్రాజెక్టును ప్రారంభించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మెట్రో రైలు నిర్మాణ నిర్ణయం యూపీఏ ప్రభుత్వ హయాంలో సోనియా గాంధీ, అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి జైపాల్ రెడ్డి, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి కలిసి తీసుకున్నారని గుర్తు చేశారు.

ప్రారంభంలో రూ.15 వేల కోట్ల అంచనాతో మెట్రో పనులు చేపట్టారని.. 2017 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లారని సీఎం తెలిపారు. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చారిత్రక ప్రాంతాల పేరుతో అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో 2014 నుంచి 2017 వరకు నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. ఫలితంగా 2020 నాటికీ ప్రాజెక్టు పూర్తికాలేదని, గౌలిగూడ ప్రాంతంలో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని చెప్పారు. దీంతో ప్రాజెక్టు వ్యయం రూ.20 వేల కోట్లకు చేరిందన్నారు.

మెట్రో విస్తరణ విషయంలో గత ప్రభుత్వం ప్రజల అవసరాల కంటే కొందరు రియల్ ఎస్టేట్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించిందని రేవంత్ విమర్శించారు. ప్రజలకు అవసరమైన ప్రాంతాలకు మెట్రో విస్తరణ జరగలేదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెట్రో రెండో దశ విస్తరణ చేపట్టాలని నిర్ణయించిందన్నారు. మెట్రో ఫేజ్-2కు అనుమతులు, నిధులు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులను పలుమార్లు కోరామని తెలిపారు. ఎల్ అండ్ టీ సంస్థను కూడా విస్తరణకు ఒప్పించే ప్రయత్నం చేశామని, అయితే గత ప్రభుత్వ విధానాల కారణంగా తమకు రూ.7 వేల కోట్ల నష్టం వచ్చిందని చెబుతూ సంస్థ సహకరించలేదని వివరించారు. రూ.13,600 కోట్ల అప్పుతో పాటు భారీ వడ్డీ భారం కారణంగా నష్టాల్లో ఉన్నామని ఎల్ అండ్ టీ చెప్పిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం కూడా ఫేజ్-2కు ముందుగా ఎల్ అండ్ టీ అనుమతి తీసుకురావాలని సూచించిందని, మళ్లీ చర్చలు జరిపినా సంస్థ అంగీకరించలేదని చెప్పారు. ఈ విషయాన్ని కేంద్రానికి వివరించగా, ఎల్ అండ్ టీ మెట్రో ఆస్తులను కొనుగోలు చేయాలని సూచించిందన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనకు అంగీకరించిందని తెలిపారు. దాదాపు రూ.30 వేల కోట్ల విలువైన ఎల్ అండ్ టీ మెట్రో ఆస్తులను రూ.15 వేల కోట్లకే కొనుగోలు చేసే ప్రక్రియ ప్రారంభించామని సీఎం వెల్లడించారు. ప్రతి ఏడాది సుమారు రూ.400 కోట్ల నష్టం వస్తున్నందున సంస్థ కూడా ఈ ప్రతిపాదనకు అంగీకరించిందన్నారు. అలాగే రూ.13,600 కోట్ల అప్పును తక్షణమే చెల్లించడం ద్వారా వడ్డీ భారం తగ్గించవచ్చని వివరించారు.

తక్కువ వడ్డీకి రుణాలు పొందేందుకు ప్రయత్నించామని.. ఇందుకోసం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ తో చర్చలు జరిపామని తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 11.5 శాతం వడ్డీకి భారీగా అప్పులు తెచ్చుకుందని ఆరోపించిన సీఎం.. తాము కేవలం 4 శాతం వడ్డీకి రుణం పొందేందుకు అనుమతులు సాధించామని చెప్పారు. దీంతో మెట్రో ప్రాజెక్టు మొదటి రోజునుంచే లాభదాయకంగా మారే అవకాశం ఉందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం చివరి నిమిషంలో నిధుల విడుదలను నిలిపివేసిందని రేవంత్ ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఖతార్‌లో జరిగిన సమావేశాల్లో జోక్యం చేసుకున్నారని పేర్కొంటూ.. తెలంగాణలో బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం మెట్రో విస్తరణకు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు.

కేంద్ర భాగస్వామ్యం అవసరం లేదని, కనీసం ఎన్వోసీ ఇచ్చి ప్రాజెక్టును ముందుకు సాగనివ్వాలని తాను కోరానని సీఎం తెలిపారు. అయితే బీజేపీ, బీఆర్ఎస్ కలిసి మెట్రో విస్తరణను అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకోవడమే వారి లక్ష్యమని విమర్శించారు. మెట్రో విస్తరణకు సంబంధించిన నిధుల విడుదల విషయంలో కిషన్ రెడ్డి స్పష్టత ఇవ్వాలని, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం సహకరించాలని సీఎం డిమాండ్ చేశారు.

## తెలంగాణలో డిజిటల్ పాలన.. ఈ-కేబినెట్‌కు గ్రీన్ సిగ్నల్!

మొదటి పేజీ తరువాయి




దీని ద్వారా మంత్రులకు పంపే కేబినెట్ అజెండా నోట్స్, ప్రతిపాదనలు అన్నీ కూడా ఎలక్ట్రానిక్ విధానంలోనే పంపనున్నారు. సమావేశంలో తీసుకునే కీలక నిర్ణయాలు, ఆమోదించే తీర్మానాలు సైతం వెంట వెంటనే డిజిటల్ రూపంలో రికార్డు కానున్నాయి.

ఈ-కేబినెట్ విధానం వల్ల ప్రభుత్వానికి అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. కాగితాల వాడకం తగ్గడం వల్ల పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా.. ప్రభుత్వ వ్యయం కూడా భారీగా తగ్గుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా కేబినెట్ సమావేశాల్లో చర్చకు వచ్చే అత్యంత కీలకమైన, రహస్యమైన సమాచారం బయటకు పొక్కకుండా పటిష్టమైన భద్రత లభిస్తుంది. ప్రతి నిర్ణయం ఆన్‌లైన్ వ్యవస్థలో నిక్షిప్తం కావడం వల్ల పరిపాలనలో జవాబుదారితనం మరింత పెరుగుతుంది. భారతదేశంలో ఇటువంటి పేపర్‌లెస్ కేబినెట్ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. ఆ తర్వాత ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్, ఉత్తరాఖండ్, త్రిపుర, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఈ డిజిటల్ విధానాన్ని అందిపుచ్చుకున్నాయి. ఇప్పుడు అదే బాటలో తెలంగాణ కూడా చేరబోతోంది.


ఈ-కేబినెట్ సమావేశాల నిర్వహణకు సంబంధించి సాధ్యాసాధ్యాలు, సాంకేతిక ఏర్పాట్లపై ఇటీవలే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఐటీ, జీఏడీ ఉన్నతాధికారులతో కలిసి ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ట్యాబ్‌ల పనితీరు, సాఫ్ట్‌వేర్ భద్రత, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రానున్న రోజుల్లో జరగబోయే తదుపరి రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని ప్రయోగాత్మకంగా లేదా పూర్తి స్థాయిలో ఎలక్ట్రానిక్ విధానంలోనే నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు.

## ఈ నెల 18న తెలంగాణ కేబినెట్ భేటీ!



**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** ఈ నెల 18న తెలంగాణ కేబినెట్ భేటీ కాబోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి మండలి సమావేశం జరగనుంది. మెట్రో టేకోవర్?పై సందిగ్ధత ఏర్పడడంతో నెక్స్ ఏం చేయాలన్న అంశంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై ప్రభుత్వం మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులతో పాటు పలు కీలక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. త్వరలో జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరగాల్సి ఉన్నందునా ఈ అంశంపై కూడా మంత్రి వర్గంలో చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే గురువారం జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశం ఎలక్ట్రానిక్ విధానంలో జరగనుంది. రాష్ట్రంలో ఇకపై ఈ-కేబినెట్ మీటింగ్స్ నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయనున్నారు. పరిపాలనలో పేపర్ లెస్ విధానం తీసుకురావాలని సీఎం అధికారులకు సూచించారు.


## 'కాక్రోచ్ జనతా పార్టీ'పై పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు




**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** గతకొన్ని నెలలుగా సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోన్న కాక్రోచ్ జనతా పార్టీపై జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం 'జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం' పేరిట జనసేన ఆధ్వర్యంలో ఢిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'చాలాసార్లు మనకుమనం తక్కువ అంచనా వేసుకున్నాం. ప్రతి వ్యక్తి కూడా సమాజంలో మార్పు తీసుకురావచ్చు. ఈ మధ్య కాక్రోచ్ జనతా పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో అందరం చూస్తూనే ఉన్నాం. కాక్రోచ్ పార్టీని చూస్తే చలిచీమల పద్యం గుర్తుకు వస్తోంది. చలి చీమలు కూడా బలమైన పాములను చంపేస్తాయి. ఒక లక్ష్యం పెట్టుకుని.. ఆ లక్ష్యం దిశగా ప్రయత్నం చేస్తే ఎవరైనా సక్సెస్ అవుతారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు' అని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

అంతకుముందు.. జనసేన ప్రారంభించినప్పుడు దేశ సమగ్రత, శ్రేయస్సు తప్ప.. తనకు ఏ ఆలోచనా లేదని అన్నారు. పార్టీ స్థాపించినప్పుడు అధికారం వస్తుందో, రాదో కూడా తెలియదన్నారు. కానీ ఈ ప్రయాణంలో చాలా పోరాటాలు చేశామని, పరాజయాలు ఎదుర్కొన్నాము, విజయాలూ సాధించామని చెప్పారు. లక్ష మంది సభ్యత్వంతో ప్రారంభమైన జనసేన, నేడు 20 లక్షలకుపైగా సభ్యత్వాలు వచ్చాయని అన్నారు. అంతేగాకుండా.. తెలంగాణ ఏర్పాటుకు ఏనాడూ జనసేన అడ్డు చెప్పలేదు. 2014లో ఏపీని విభజించిన తీరును చూసి మాత్రమే ఆవేదన వ్యక్తం చేశాం. విభజన విషయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరు.. అసంతృప్తిని, అశాంతిని సృష్టించింది. అప్పటి నుంచి ఇప్పటికీ వారి ధోరణి మారలేదు. జనసేన సభకు అనుమతివ్వకుండా అడ్డుకోవడమే అందుకు ఉదాహరణ అని పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

## జైపూర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ నిరసన చీఫ్ అభిజీత్ దీప్కేపై దుండగుల అటాక్



**న్యూస్ డెస్క్,15 జూన్ (తెలుగు గళం):** నీట్ పరీక్షల పేపర్ లీకేజీ, పెరుగుతున్న నిరుద్యోగ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ జైపూర్‌లోని షహీద్ స్మారక్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు చేపట్టారు. అయితే, ఈ ఆందోళనల సందర్భంగా అభిజీత్ దీప్కేపై దుండగులు మొఖంపై చంపదెబ్బలతో ఒక్కసారిగా అటాక్ చేశారు. అసలు ఏం జరుగుతుందో తేరుకునే లోపే దాడి చేసిన వారు అక్కడి నుంచి పరార్ అయ్యేందుకు ప్రయత్నించగా సీజేపీ కార్యకర్తలు పట్టుకుని తిరిగి వారికి దేహశుద్ధి చేశారు. కాగా, గత నెలలో కూడా అభిజీత్ దీప్కేకు వాట్సాప్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ప్రాణహాని బెదిరింపులు వచ్చిన మాట వాస్తవమే. ఆ సమయంలో ఆయన సోషల్ మీడియా ఖాతాలను హ్యాక్ చేయడానికి కొందరు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలోనే జైపూర్‌లో నిరసనల వేళ ఆయనకు భారీ భద్రత కల్పించనప్పటికీ దుండగులు దాడి చేయడం గమనార్హం. ప్రస్తుతం దాడికి సంబంధించి వీడియోలు సైతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

# మౌలాలిలో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం




## 21 యూనిట్ల రక్తదానం చేసిన దాతలు

హైదరాబాద్, జూన్ 15

సికింద్రాబాద్‌లోని మౌలాలిలో ఆదివారం నిర్వహించిన మజ్లిస్ అన్సారుల్లాహ్, ఖుద్దాముల్ అహ్మదీయ్యా మరియు అత్ఫాలుల్ అహ్మదీయ్యా వార్షిక ఇజ్తిమా సందర్భంగా జమాతే అహ్మదీయ్యా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జమాత్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని మొత్తం 21 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జమాత్‌కు చెందిన మహిళలు కూడా ముందుకు వచ్చి రక్తదానం చేయడం విశేషంగా నిలిచింది. రక్తదానం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ప్రాణదానం చేసినట్లేనని నిర్వాహకులు తెలిపారు. ఇజ్తిమాలో పాల్గొన్న మౌల్వీ నూర్ మియా మీడియాతో మాట్లాడుతూ, జమాతే అహ్మదీయ్యా స్థాపన నుంచే మానవతా సేవలకు ప్రాధాన్యత ఇస్తోందని, "ప్రేమ అందరితో -- ద్వేషం ఎవరితో లేదు" అనే సందేశంతో సమాజ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు అవసరమైన వారికి ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. జమాతే అహ్మదీయ్యా ప్రపంచవ్యాప్తంగా విద్య, వైద్యం, విపత్తు సహాయ కార్యక్రమాలతో పాటు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ మానవ సేవలో ముందంజలో ఉందని ఆయన తెలిపారు.




# సత్తుపల్లిలో ఘనంగా బడిబాట కార్యక్రమం ప్రారంభం

## విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



సత్తుపల్లి,ఆర్ సి,జూన్15(తెలుగుగళం) న్యూస్:
సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజు నుంచే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందించడం ప్రభుత్వ విద్య పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో గెలిచిన నాటి నుంచి పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లను నిరంతరం సందర్శిస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ సహాయంతో పాటు తమ ఆశా ఫౌండేషన్ ద్వారా కూడా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. చదువు అంటే మాకు ఎంతో ఇష్టం. నేడు విద్యార్థులు పొందే విద్యే రేపటి వారి కుటుంబాలను, సమాజాన్ని ముందుకు నడిపిస్తుంది. చదువే మన ఆస్తి, గౌరవం, జీవితానికి పునాది" అని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అల్పాహారం, పాలు వంటి పోషకాహార కార్యక్రమాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ రామ్మోహన్, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత వేణు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, యూపీఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కాకర్లపల్లి పేదలకు ఇండ్ల స్థలాలిచ్చే వరకు పోరాటం ఆగదు

- స్థలాలిస్తే ఆ పేరు మాకొద్దు... ఆ పేరు మీకే
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు
- ఇండ్ల స్థలాల సాధనకు రిలే దీక్షలకు దిగిన కాకర్లపల్లి పేదలు



సత్తుపల్లి, ఆర్ సి,జూన్15(తెలుగుగళం) న్యూస్:
సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో ఇండ్లు,ఇండ్ల స్థలాలు లేని పేదలకు ఇండ్ల స్థలాలిచ్చేంత వరకు సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమం ఆగదని, సమస్య పరిష్కారమయ్యేంత వరకు సీపీఐ(ఎం) శ్రేణులు ఇండ్లు లేని పేదలకు అండగా ఉంటాయని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కాకర్లపల్లి ఇండ్ల స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో సత్తుపల్లిలోని పోస్టాఫీసు ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట రిలే దీక్షల



కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ దీక్షలను నున్నా నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో నున్నా మాట్లాడారు. కాకర్లపల్లి పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చే వరకు మా పోరాటం ఆగదని తెగేసి చెప్పారు. స్థలాలు రాకుండా అడ్డుపడితే ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఇంటిని సైతం ముట్టడిస్తామని నున్నా హెచ్చరించారు. మా ప్రాణాలు పోయినా సరే వెనక్కి తగ్గేదేలేదన్నారు. అవసరమైతే ఆమరణ దీక్షలకు సైతం దిగుతామని కుండబద్దలు కొట్టారు. ఇండ్ల స్థలాలు రాకుండా అడ్డుపడుతున్న నాయకులపై నాగేశ్వరరావు నిప్పులు చెరిగారు. మాకు ఇండ్లులేవు, ఇండ్ల స్థలాలు లేవంటూ కుయ్యో, మొర్రో అంటూ కాకర్లపల్లి నుంచి సత్తుపల్లి వరకు గతంలో ఎర్రటెండలో పాదయాత్ర కూడా చేశారన్నారు. అయినా పాలకులకు కనికరం లేకుండా పోయిందని గర్హించారు. ఖమ్మం వెళ్లి కలెక్టర్ను సైతం కలిశారన్నారు. సబ్ కలెక్టరును పలుమార్లు కలవడం జరిగిందన్నారు. తహసీల్దారు కార్యాలయం ముందు పలు దఫాలుగా ధర్నాలు కూడా చేశారన్నారు. ఆఖరికి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సైతం కలిశారన్నారు. మంత్రి నుంచి మొదలుకొని కలెక్టర్, సబ్ కలెక్టర్, తహసీల్దారు వరకు అందరూ సానుకూలంగా స్పందించారన్నారు. మంత్రి పొంగులేటి అధికారులకు కూడా ఆదేశాలిచ్చారని, కాని అందింత వరకు అమలుకు నోచుకోలేదని నున్నా ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలో కాకర్లపల్లి కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దగ్గర తమ పలుకుబడిని ఉపయోగించి ఇండ్ల స్థలాలు రాకుండా అడ్డుపడుతున్నారని, ఇందుకు ఎమ్మెల్యే సైతం స్థలాలు ఇచ్చే విషయంలో మిన్నకుండి పోయారని ఆరోపించారు. కాకర్లపల్లిని ఆనుకొని విరాట్ నగర్ వరకు నిరుపయోగంగా ఉన్న పాత ఎన్టీఆర్ కాలువను పూడ్పించినట్లయితే సుమారుగా 34 ఎకరాల వరకు ఇండ్ల స్థలాలకు ఉపయోగపడుతుందన్నారు. సుమారుగా 1000 మందికి పైగా ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. సత్తుపల్లిలో సుమారుగా 3వేల మందికి పైగా సోశీతిండ్లు, సొంత స్థలాలు లేవన్నారు. సీపీఐ (ఎం) పోరాట ఫలితంగా మీరు స్థలాలిచ్చినా ఆ పేరు మాకొద్దని, ఆ ఘనత మీకే దక్కుతుందని నాగేశ్వరరావు అన్నారు. మాకు పేరు రావడం ముఖ్యం కాదని, పేదలకు స్థలాలు రావడమే ముఖ్యమని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ,పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఎవరెన్ని అడ్డంకులు పెట్టినా, అడ్డు పడినా పోరాటం కొనసాగాలన్నారు. మీ సమస్య పరిష్కారమయ్యే వరకు సీపీఐ (ఎం) అండగా ఉంటుందని స్పష్టం చేశారు, సీపీఐ (ఎం) మండల కార్యదర్శి జాజిరి జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, మోరంపూడి పాండురంగారావు, పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, డివిజన్ కమిటీ సభ్యులు రావుల రాజబాబు, మిట్టపల్లి నాగమణి, పాకలపాటి ఝాన్సీ, పీఎన్ఎం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కండే సత్యం, అయినంపూడి సనందనరావు, మండల కమిటీ సభ్యులు వేపులపాటి కుమారస్వామి, బండి వేలాద్రి, కువ్వారపు లక్ష్మణరావు, తడికమళ్ల రామకృష్ణ, కావూరి వెంకటేశ్వరరావు, దాట్ల రాంబాబు, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు పొదిలి నరేశ్, బెజవాడ కృష్ణవేణి, ఆంగోతు చిట్టెమ్మ, పరిమి సీతామహాలక్ష్మి, ఐద్వా డివిజన్ అధ్యక్షురాలు చెరుకు రత్నకుమారి, అలివేలు పాల్గొన్నారు.

# యూరియా నిల్వలు పెంచాలి.. నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవాలి



కల్లూరు,జూన్ 15 (తెలుగుగళం న్యూస్): రైతులకు అవసరమైన యూరియా నిల్వలను ముందస్తుగా అందుబాటులో ఉంచడంతో పాటు నకిలీ విత్తనాలు సరఫరా చేసే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి ముదిగొండ అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంజిల్లా కల్లూరు వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాసిరకం విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు కంపెనీల ద్వారా నష్టపరిహారం అందించాలని కోరారు. మొక్కజొన్న రైతులకు పెండింగ్‌లో ఉన్న చెల్లింపులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత సీజన్‌లో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నందున ఈ సీజన్‌లో తగిన నిల్వలు ఏర్పాటు చేయాలని, యూరియా యాప్‌ను రద్దు చేయాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారి రూపకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు సామినేని హనుమంతరావు, మాదల వెంకటేశ్వరరావు, తన్నీరు కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు లో ఉప ముఖ్యమంత్రి భట్టి జన్మదిన వేడుకలు”



సత్తుపల్లి,ఆర్ సి,జూన్15(తెలుగుగళం) న్యూస్: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని కల్లూరు పట్టణ జాతీయ రహదారిపై ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు,అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోట్రు అర్జున్ రావు, కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్, ఏఎంసీ చైర్‌పర్సన్ శ్రీమతి భాగం నీర్జా దేవి, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. భారీ సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం భట్టి విక్రమార్క చేస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. ఆయనకు ఆయురారోగ్యాలు, మరిన్ని ఉన్నత పదవులు లభించాలని ఆకాంక్షించారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలి తెలంగాణ రైతు సంఘం డిమాండ్

- రైతులకు యూరియా కొడతా లేకుండా చూడాలి ప్రభుత్వం
- పెండింగ్ లో ఉన్న రైతు భరోసానిధులను తక్షణమే అందించాలి




సత్తుపల్లి, ఆర్ సి,జూన్15(తెలుగుగళం) న్యూస్: తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సత్తుపల్లిలో అగ్రికల్చర్ ఏఈఓ కి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను అందించాలని అదేవిధంగా రైతులకు పెండింగ్లో ఉన్న రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రైతుసంఘం డిమాండ్ చేస్తుందన్నారు. పంటలకు యూరియా కొరత లేకుండా తక్షణం రైతులందరికీ చూడాలన్నారు. అంతే కాకుండా పెరిగినటువంటి ఎరువుల ధరలను తగ్గించి రైతులకు సబ్సిడీపై ఎరువులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులకు పంట పొలాలకు వెళ్లే కాలువలను మరమ్మత్తులు చేసి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో: మోరంపూడి పాండురంగారావు,కొలిక పోగు సర్వేశ్వరరావు,రైతు సంఘం నాయకులు బాల బుచ్చయ్య,మోరంపూడి వెంకట్రావు,కంచర్ల వెంకటేశ్వరావు,ఈదర చంటి చావా రమేష్,చెరుకు రత్నకుమారి, పాకలపాటి ఝాన్సీ, పుష్పవల్లి, నిమ్మకూరీ రోజా తదితరులు పాల్గొన్నారు.

# గూడు కోల్పోయిన పేదలకు విపత్తుల చట్టం కింద పరిహారం ఇప్పించండి సారు”

## ప్రజావాణి లో తహశీల్దార్ కు సీపీఎం వినతి”



వేంసూరు,జూన్15(తెలుగు గళం) న్యూస్: జూన్ 10 వ తేదిన ఖమ్మంజిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో పలు గ్రామాలలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు జరిగి భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసిన విషయం,ఆస్తి నష్టం,ధాన్యం నష్టం జరిగిన విషయాలు పాఠకులకు విదితమే. దాంతో మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో కందుకూరు గ్రామం వెళ్ళే రహదారిలో గల దళిత వాడ లో పేదలైన సాధు నాగదివ్య శరత్ బాబు, సాధు సరోజినీ ఇస్త్రయ్య,సాధు ఝాన్సీ వెంకటేశ్వరరావు,రావూరి హేమలత నాగేష్ అనే వారు నివాసం ఉంటున్న తమ గూడులపై రేకులు ధ్వంసం అయి అట్టి గృహాలలో ఉన్న టీవీ, ఫ్యాన్స్, కూలర్లు తడిచి పాడయిన దుస్థితి ఏర్పడింది. అట్టి విషయం తెలుసుకున్న రెవిన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అట్టి నష్టపోయిన పేదల కుటుంబాలకు తక్షణమే జాతీయ, రాష్ట్ర ప్రకృతి విపత్తుల చట్టం కింద నష్ట పరిహారం ఇప్పించి వారిని ఆదుకోండి సారు అంటూ సోమవారం వేంసూరు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సీపీఎం నేత మల్లూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని తహశీల్దార్ జె.మాణిక్ రావు కు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో: బాధితులు,సీపీఎం నేత సాధు శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# రేగొండలో ఘోర ప్రమాదం

- తాడిచెట్టుపై నుండి ప్రమాదవశాత్తు పడి గీత కార్మికుడు అక్కడికక్కడే మృతి





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ
జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో సోమవారం ఉదయం ఒక కల్లుగీత కార్మికుడు తాడిచెట్టుపై నుండి ప్రమాదవశాత్తు కిందపడి ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. రేగొండ మండల కేంద్రానికి చెందిన గండి సదయ్య (55) అనే గీత కార్మికుడు ప్రతిరోజులాగే తన కులవృత్తిలో భాగంగా సోమవారం ఉదయం కల్లు గీయడానికి గ్రామ శివారులోని తాటి వనానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆయన తాడిచెట్టు ఎక్కి కల్లు గీస్తున్న సమయంలో ఒక్కసారిగా కాలు జారి, అదుపుతప్పి పైనుండి కిందపడిపోయాడు. చాలా ఎత్తు నుండి సదయ్య నేరుగా కింద పడటంతో ఆయన తలకు,శరీర భాగాలకు బలమైన, తీవ్రమైన గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన సమీప పొలాల రైతులు,స్థానికులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే,తీవ్ర రక్తస్రావం కావడం వల్ల సదయ్య అప్పటికే అక్కడికక్కడే మరణించినట్లు స్థానికులు నిర్ధారించారు. ఈ ఘోర ప్రమాద వార్త తెలియగానే రేగొండ మండల కేంద్రంలో ఒకేసారి విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడు గండి సదయ్య నిరుపేద కుటుంబానికి చెందినవాడు కావడంతో, కుటుంబానికి ఆధారమైన వ్యక్తి ఇలా అకాల మరణం చెందడంపై భార్యాపిల్లలు, బంధువులు ఘటనా స్థలంలో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దశాబ్దాలుగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కష్టపడుతున్న గీత కార్మికులకు చెట్లపై ఎలాంటి రక్షణ ప్రమాణాలు లేకపోవడం వల్లే ఇలాంటి ప్రాణాంతక ప్రమాదాలు పునరావృతమవుతున్నాయని తోటి కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం,గీత కార్మిక సంఘాలు ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కాసోజు శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్ సుదగాని నియామకం








**తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / జూన్ 16, ఖమ్మం జిల్లా :**
సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ విస్తరణలో భాగంగా ఖమ్మం జిల్లా కమిటీకి నూతన బాధ్యులను నియమించారు. సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయం, రాష్ట్ర అధ్యక్షులు ఎలిగెండ్ల వెంకటేష్ సిఫార్సుల ఆధారంగా ఈ నియామకాలు చేపట్టినట్లు సంస్థ వర్గాలు వెల్లడించాయి.

ఈ మేరకు కాసోజు శ్రీధర్‌ను సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా, నియమించారు.

కరుణాకర్ సుదగాని ని జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ, నియామక పత్రాలను జారీ చేశారు. ప్రజల్లో సమాచార హక్కు చట్టంపై మరింత అవగాహన కల్పించడం, ప్రజా సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన మార్గాల్లో పోరాటాలు నిర్వహించడం, సంస్థను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా, ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు సంస్థ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ, ప్రజల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేస్తారని, నాయకత్వం ఆశాభావం వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా సామాన్య ప్రజలకు న్యాయం అందించడంలో కమిటీ కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజలకు అవసరమైన సమాచారం అందేలా చేయడమే సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే సంస్థ బలోపేతం కోసం రాష్ట్రవ్యాప్తంగా కమిటీల పునర్వ్యవస్థీకరణ కొనసాగుతోందని, అన్ని జిల్లాల్లో సమర్థవంతమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, పారదర్శక పాలన సాధనకు సమాచార హక్కు చట్టం సమర్థవంతమైన ఆయుధమని, దాని పరిరక్షణకు కమిటీ నిరంతరం కృషి చేస్తుందని, వెల్లడించారు. ఈ సందర్భంగా జాతీయ వర్కింగ్ అధ్యక్షులు ఎటి ఆంజనేయులు చేతుల మీదుగా కాసోజు శ్రీధర్, కరుణాకర్ సుదగాని లకు నియామక పత్రాలను అందజేశారు.

నూతన బాధ్యులకు సంస్థ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి నాయకత్వంలో ఖమ్మం జిల్లాలో సంస్థ కార్యకలాపాలు మరింత విస్తరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వేంసూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన కాసర చంద్రశేఖర రెడ్డి”

### ఐక్యతే ఆయన ఉద్దేశ్యం”



**వేంసూరు,జూన్ 15(తెలుగు గళం) న్యూస్:** ఖమ్మంజిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాసర చంద్రశేఖరరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి సమస్యను పరిష్కరించుకుంటూ అందర్నీ కలుపుకొని పని చేస్తానని మాట ఇచ్చారు.

అలాగని ఈ అవకాశాన్ని ఇచ్చిన సత్తుపల్లి శాసన సభ్యురాలు రాగమయికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామ అధ్యక్షులతో కలుపుకొని పనిచేస్తానని రానున్న కాలంలో కాంగ్రెస్ విజయాల కోసం తనవంతు కృషి చేస్తానని కాసర స్పష్టం చేశారు.

కాసర చంద్రశేఖర్ రెడ్డి తిరిగి వేంసూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైనందుకు పలువురు కాంగ్రెస్ నేతలు,అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాసర సున్నితమైన స్వభావం గల వ్యక్తి అని పార్టీలో అందరిని కలుపుకు పోతూ పనిచేస్తారని ఐక్యతకు పెద్దపీట వేస్తారని ఆయన మండల అధ్యక్షుడుగా మరోసారి ఉండటం చాలా ఆనందం కలిగే విషయం అని మండలంలోని పలు గ్రామాల కాంగ్ నేతలు తెలిపారు.

## మంత్రి పొంగులేటి ప్రజాదర్బార్ లో చెప్పినా మార్పు రాదా?

- జిల్లా కలక్టర్ సాధారణ పౌరునిలా
- వేంసూరు ప్రజావాణి కు రావాలా?
- మెజిస్ట్రేట్ కు పనులు లేవా” వారికే ఉన్నాయా?
- గౌరవమా” అగౌరవమా” ఆ నలుగురేనా”
- ప్రజావాణికి డుమ్మా కొట్టిన పలు శాఖలు”
- వారిపై చర్యలు లేవా”
- ప్రజలు ఎక్కువ అధికారులు తక్కువ”
- ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేనా”



**వేంసూరు,జూన్15(తెలుగు గళం) న్యూస్:**
ఖమ్మంజిల్లా సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంలో ఇటీవల రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గ స్థాయిలో ప్రజా దర్బార్ అన్ని శాఖల అధికారులతో నిర్వహించి ప్రజలకు అండగా అందుబాటులో ఉండాలని ప్రజావాణి లో అందుబాటులో ఉండి సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు.కానీ వేంసూరు మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయంలో ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అది మాకేమి పట్టదు అన్న వైనం అగుపించింది.పరిశీలనకు జిల్లా కలెక్టర్ సాధారణ పౌరునిలా రావాలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

మాకెంటిలే అనే పద్ధతిలో పలు శాఖల అధికారులు,సిబ్బంది వ్యవహరిస్తున్న వైనం సోమవారం తెలుగుగళం ప్రతినిధి నిఘా నేత్రానికి చిక్కింది.మండల మెజిస్ట్రేట్ తహశీల్దార్ కు పనులు లేవా కేవలం ఆ శాఖల వారికే పనులు ఉన్నాయా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పల్లె నుండి జిల్లా కేంద్రానికి వెళ్లకుండా మండల స్థాయిలోనే పరిష్కారం చేయాలనే సదుద్దేశ్యంతో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుంది.అట్టి బృహత్తర కార్యక్రమానికి నిర్వాహకులు గా వ్యవహరించే మెజిస్ట్రేట్ కు ఆ డుమ్మా కొడుతున్న శాఖలు గౌరవిస్తున్నాయా అగౌరపరిస్తున్నాయ అనే ప్రశ్న మండల ప్రజలలో సర్వత్ర చర్చ జరుగుతోంది.పరిశీలిస్తే ఆ నలుగురు సినిమా లా వేంసూరు మండల ప్రజావానికి ఆ నాలుగు శాఖల అధికారులే హాజరైన వైనం గళం నిఘా నేత్రానికి చిక్కింది.కేవలం వైద్య ఆరోగ్య శాఖ,పశు సంవర్ధకశాఖ,శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ నుండి మాత్రమే హాజరు అయ్యారు.ఖాళీ కుర్చీలు ఉంటే బావుశీడదేమో అని రెవిన్యూ శాఖకు చెందిన జి పి ఓ లు కూర్చున్న దృశ్యం అగుపించింది.కానీ ఈ నాలుగు శాఖలు ఎమర్జెన్సీ శాఖలుగా ఉంటాయి కానీ వారు హాజరైన పరిస్థితి బలా భేష్ అనిపిస్తుంది.

మండలాభివృద్ధికి సూచకంగా స్వర్గీయ ఎన్టీఆర్ మండలాల వ్యవస్థ నిర్మించి మండల పరిషత్ కార్యాలయాలను తెచ్చిన విషయం పాఠకులకు విదితమే అట్టి శాఖ నుండి కానీ,ఐకెపి నుండి కానీ,ఉపాధిహామీ నుండి కానీ ఒక్కరు కూడా హాజరు కానీ దుస్థితి అగుపించింది. ఇక పోతే రక్షణ, అగ్ని ప్రమాద, విద్యుత్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, ఆర్ డబ్ల్యు, ఎస్, అటవీ, ప్రోహిబిషన్, వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, హాజరు కాలేదు. మరి పల్లెల్లో ఉండే ప్రజలకు నిత్యం ఎదురయ్యే సమస్యలకు లింక్ లో ఉండే ఈ శాఖలు హాజరు కాలేదు.మరి ఆ సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు ప్రజావాణికి వచ్చి వారి గోడు ఎవరికి వెళ్లబోసుకోవాలో అర్థం కాక జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులకు,స్థానిక శాసన సభ్యురాలికి విన్నవించడానికి సిద్ధం అవుతున్నట్లు వినికిడి.ప్రజావాణి కి ప్రజలు ఎక్కువ శాఖలు తక్కువగా అగుపించింది.ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేనా అని సందేహాలు మెండుగా కనిపిస్తున్నాయి.మరి ఇంత జరుగుతున్న చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అనే సందేహానికి త్వరలో తెర పడుతుందని ప్రజావాణి కు గౌరవం దక్కుతుందని ఆశిద్దాం.

## హోంమంత్రి అనితకు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ గురించి మాట్లాడే అర్హత లేదు



**తెలుగు గళం న్యూస్ ,విశాఖ, జూన్ 15 :** హోంమంత్రి అనితకు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ గురించి మాట్లాడే అర్హత లేదు. నీ పదవి కాపాడుకోవడం కోసం గుడివాడ అమర్నాథ్ పై విమర్శలు చేస్తున్నావు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ నాయకులు

రాష్ట్ర హోంమంత్రి శ్రీమతి వంగలపూడి అనిత గారు మాజీ మంత్రి శ్రీ గుడివాడ అమర్నాథ్ గారిపై చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరంగా, బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ నాయకురాలు మండిపడ్డారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉండవచ్చు కానీ వ్యక్తిగత విమర్శలు చేయడం, కుటుంబాల చరిత్రను అవమానించే విధంగా మాట్లాడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ గారు విశాఖ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు కలిగిన రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి అని గుర్తు చేశారు. ఆయన కుటుంబం తరతరాలుగా ప్రజా సేవలో ఉందని, మాజీ శాసన సభ్యులు స్వర్గీయ గుడివాడ అప్పన్న గారు ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న నాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. అలాగే ఆయన తండ్రి స్వర్గీయ గుడివాడ గురునాథరావు గారు ఎమ్మెల్యేగా, విద్యాశాఖ మంత్రిగా సేవలందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. అలాంటి కుటుంబ నేపథ్యం కలిగిన వ్యక్తిపై వ్యాఖ్యలు చేసే ముందు కనీస అవగాహన కలిగి ఉండాల్సిన బాధ్యత హోంమంత్రిగా అనిత గారికి ఉందని అన్నారు. గుడివాడ అమర్నాథ్ గారిపై వ్యాఖ్యలు చేయడం అంటే కేవలం ఒక వ్యక్తిని విమర్శించడం మాత్రమే కాదని, దశాబ్దాలుగా ప్రజలకు సేవ చేస్తున్న ఒక కుటుంబ ని అవమానించడమే అవుతుందని పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శలు విధానాలపై ఉండాలి తప్ప వ్యక్తులపై, కుటుంబాలపై ఉండకూడదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో హుందాతనం, పరస్పర గౌరవం కొనసాగాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ గారిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను హోంమంత్రి అనిత గారు వెంటనే ఉపసంహరించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశం లో మాజీ డి.సి.ఎం.ఎస్ చైర్మన్ పళ్ళ చిన్న తల్లి , జిల్లా అంగన్వాడి విభాగం అధ్యక్షులు శ్రీ దేవి వర్మ , జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జియ్యని వెంట సత్య , జిల్లా అంగన్వాడి విభాగం ఉపాధ్యక్షురాలు ఇప్పిలి పార్వతి పాల్గొన్నారు .

## అంగన్వాడీల్లో చిన్నారుల చేరికలకు ప్రత్యేక ప్రచారం

### ‘అమ్మమాట--అంగన్వాడి బాట’ కార్యక్రమానికి గ్రామస్తుల విశేష స్పందన”



**వేంసూరు,జూన్ 15 (తెలుగు గళం న్యూస్) :** చిన్నారుల సమగ్ర అభివృద్ధి,పోషకాహార భద్రత లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ‘అమ్మమాట--అంగన్వాడి బాట’ కార్యక్రమాన్ని సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల కొండగట్ల--1, శంభునిగూడెం గ్రామాలలో గల అంగన్వాడీ కేంద్రాల్లో బీరాపల్లి సెక్టార్ సూపర్ వైజర్ ఇజ్జిగాని గంగాజలం పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టి, 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.



అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న ప్రీ-స్కూల్ విద్య, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ఆటపాటల ద్వారా అభ్యాసం వంటి సేవలపై తల్లిదండ్రులకు వివరించారు. చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీలు తొలి మెట్టుగా నిలుస్తాయని, ప్రతి అర్హత కలిగిన చిన్నారిని కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో: కొండగట్ల సర్పంచ్ కె.రజని,గ్రామ కార్యదర్శి మాధురి, ప్రధానోపాధ్యాయులు వీరాంజనేయులు, హెల్త్ సూపర్వైజర్ గనిపిశెట్టి శ్రీనివాస్, ఏఎన్ఎం కృష్ణవేణి, అంగన్వాడీ టీచర్లు కరుణ, రాహేలు, గ్రామ మహిళలు, తల్లులు పాల్గొన్నారు. నూతనంగా సెక్టార్ సూపర్వైజర్‌గా బాధ్యతలు స్వీకరించిన గంగాజలం కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు విశేషంగా స్పందించి కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

## బాధితులకు పరిహారం



**ప్రకాశం జిల్లా (తెలుగు గళం):** ప్రకాశం జిల్లా, అచ్చంపేట మండలం కోనూరు గ్రామంలో విహారయాత్రకు వెళ్లి పడవ ప్రమాదంలో నలుగురు చిన్నారులు మృతిచెందిన విషయం తెలిసిందే. తక్షణమే స్పందించి ప్రగాఢ సానుభూతి తెలిపి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మృతుల కుటుంబాలకు చెక్కులను జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల , ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ,జిల్లా అధ్యక్షులు జానీ సైదా అందచేశారు.

## రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ రైతుసంఘం ఆందోళన


### ప్రజావాణి లో తహశీల్దార్ కు వినతి”



**వేంసూరు,జూన్15(తెలుగు గళం) న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద నిధులు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల సీపీఎం అనుబంధ తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం వేంసూరు లోని తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో తహశీల్దార్ జె.మాణిక్ రావు కు వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా మాణిక్ రావు జిల్లా కలెక్టర్ కు లేఖ పంపుతామని హామీ ఇచ్చారు.అనంతరం ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కొత్తా సత్యనారాయణ,అర్వపల్లి గోపాలరావు లు మీడియాతో మాట్లాడుతూ రైతాంగానికి కల్తీ లేని నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని,యూరియా యాప్ విధానం ఎత్తి వేసి వ్యవసాయ రంగానికి కావలసినంత యూరియా ప్రభుత్వమే నేరుగా సబ్సిడీతో అందించాలని,సాదా బైనామా ప్రక్రియ తిరిగి ప్రారంభించి మిగిలిపోయిన గత ప్రభుత్వం హయంలో అధికారులకు లంచాలు ముట్టజెప్పి చేపించుకోలేక ఆగిపోయిన సాదా డాక్యుమెంట్ లు ఉన్న నిరుపేద,చిన్న సన్న కారు రైతులకు పట్టదారు పాసు పుస్తకాలు మంజూరు చేసి ఆదుకోవాలని,మొక్కజొన్న అమ్మిన రైతులకు సొమ్ము చెల్లించాలని,పంట కాలువల మరమత్తులు చేపట్టాలని,నూతన విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాలని, పెరిగిన ఎరువుల,పెట్రోల్,డీజిల్ ధరలను నియంత్రించాలని,మండలంలో పామాయిల్ సాగులో ఉన్న ప్రతి గ్రామంలో ఆయిల్ ఫెడ్ అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో: సీపీఎం మండల కన్వీనర్ అర్వపల్లి జగన్మోహన్ రావు,సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్, పామాయిల్ రైతుల సంఘం నేత దొడ్డా చక్రధర్ రెడ్డి, మోరంపూడి వెంకటేశ్వరరావు, బేతిని నాగేశ్వరరావు, చెన్నయ్య, కొత్తా అప్పారావు, ఎండిమండల వెంకటేశ్వరరావు, రాయల చెన్నారావు, పుచ్చకాయల వెంకటేశ్వర రావు, సాధు శరత్ బాబు, అర్వపల్లి వెంకటేశ్వరరావు, నున్నా సత్యనారాయణ, అర్వపల్లి మోహన్ రావు, సాయిని సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కడపలో రౌడీ షీటర్లపై ఉక్కుపాదం



**కడపజిల్లా(తెలుగు గళం)జూన్ 15:** రౌడీ షీటర్లు నేర ప్రవృత్తి మానుకోకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ట్రబుల్ మాంగర్లు,గతంలో నేరాలకు పాల్పడిన వారి కదలికలపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచాలని,మట్కా, క్రికెట్ బెట్టింగ్,గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కడప సబ్ – డివిజన్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ. గ్రామసభలు, పల్లెనిద్ర, గ్రామాల సందర్శన తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్,గ్యాంబ్లింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భూ వివాదాలు,ఆర్థిక పరమైన అంశాల వలన క్రిమినల్ కేసులు నమోదైన ఎడల వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల మరియు లీగల్ ప్రొసీజర్ మేరకు కేసు విచారణ త్వరితగతిన నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి నిర్ణీత వ్యవధిలోగా చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. డ్రోన్ కెమెరాల ద్వారా గంజాయి,ఇతర మత్తు పదార్థాలు,బహిరంగ మద్యపానం చేసే వారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.